క్లుప్తంగా

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

దమ్మపేట: మండల పరిధిలోని రంగువారిగూడెం గ్రామ శివారు నుంచి జలవాగు గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రజాప్రతినిధులతో కలసి బుధవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.63 లక్షలతో బీటీ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, సర్పంచ్ కొర్సా సాయిరూప, ఆళ్ల జంగం, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన టీపీసీసీ సభ్యులు



పొంగులేటితో బుడగం శ్రీనివాస్

భద్రాచలం: కాంగ్రెస్‌లో చేరబోతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ బుధవారం ఖమ్మంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జూలై 2న ఖమ్మంలో జరిగే కాంగ్రెస్ మహాసభకు కార్యకర్తలను, అభిమానులను పెద్ద ఎత్తున తరలివచ్చే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆదేశాల మేరకు కలిసి స్వాగతిస్తున్నట్లుగా బుడగం శ్రీనివాస్ వెల్లడించారు.

ఆర్థిక సాయం

బూర్గంపాడు: మోరంపల్లిబంజరకు చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన నడిపింటి రమేష్ కుటుంబానికి రూ.14వేల ఆర్థిక సాయమందించారు. ఈయన కుమార్తె అయిన 11 ఏళ్ల ధరణి గత కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల ఆమెను పరీక్షించిన వైద్యులు.. ఆమె కడుపులో గడ్డ ఉందని, శస్త్ర చికిత్సలు చేయించాలని సూచించారు. ఇందుకోసం రూ.2 లక్షల ఖర్చవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ బాధ్యులు సాయమందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, కైపు రాజేందర్‌రెడ్డి, ఆవుల శివనాగిరెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, పేరం రామిరెడ్డి, సంకా సురేష్, బాలనారాయణరెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి, ఎం.వెంకటనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిని ఉషారాణి

దుమ్ముగూడెం: మండలంలోని నందుల చెలక గ్రామంలో ఆర్లగూడెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని ఉషారాణి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయ్‌కుమార్, ఈశ్వరి, సోయం రేణుక, సరస్వతి పాల్గొన్నారు.

సేవలు పునఃప్రారంభం

దమ్మపేట: మండల పరిధిలోని విద్యా వనరుల కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిని కీసర లక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి బుధవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఫిజియోథెరపీ వైద్య సేవలు ఇక్కడ అందించబడునని తెలిపారు. కేంద్రానికి రాలేని పిల్లలు ఉంటే, సమాచారం మేరకు ఇంటికి వచ్చి సేవలు అందిస్తామని అన్నారు. ఫిజియోథెరపిస్ట్ మాగంటి ప్రభాకరరావు, ఐఈఆర్పీలు నాగలక్ష్మి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

పినపాక: జులై 2న ఖమ్మంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు వందల సంఖ్యలో కార్యకర్తలు నాయకులు తరలి విజయవంతం చేయాలని మండల పొంగులేటి యువసేన నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఈ మేరకు బయ్యారం క్రాస్ రోడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వుడుముల లక్ష్మారెడ్డి, పెరం వెంకటేశ్వరరావు, పొట్లపల్లి ఉపసర్పంచ్ కస్తూరి లింగయ్య, నాయకుల ఉడుముల రవి తదితరులు పాల్గొన్నారు.

ఇవేం 'పనులు' సారూ..?

- పాఠశాలలో నల్లాలు, ట్యాంకుల నిర్మాణం
- హంగులతో మరుగుదొడ్లు ఏర్పాటు
- ప్రతిపాదనల్లో లేని బోరు, మోటారు
- 'మన ఊరు–మన బడి' పనుల తీరిదీ..



పాఠశాలలో నిర్మించిన వాటర్ ట్యాంకు, ఏర్పాటు చేసిన నల్లాలు



ఉపయోగంలో లేని మరుగుదొడ్లు

అశ్వారావుపేటరూరల్: సర్కారు బడుల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెబుతున్న మాటలు ఆచరణలో కనిపించడం లేదు. లక్షల్లో నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నప్పటికీ తాగునీటి గోసను తీర్చలేకపోతున్నట్లు విమర్శలు వెల్లువెత్తున్నాయి. దాంతో ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు తాగునీటి కోసం పాట్లు పడాల్సివస్తోంది.

అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో తొమ్మిది మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, 8వ తరగతి వరకు బోధన అందుబాటులో ఉంది. ఈ పాఠశాలకు ఆసుపాక, ఆసుపాక కాలనీ, తండా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. అయినప్పటికీ పాఠశాలలో గడిచిన కొన్నేళ్లుగా తాగునీటి సౌకర్యం లేదు. దాంతో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే బాటిళ్లలో తాగునీరు తెచ్చుకోవాల్సి పరిస్థితి నెలకొంది.

'మన ఊరు–మన బడి'కి ఎంపికైనా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మన ఊరు–మన బడి'పథకంలో భాగంగా తొలి విడతలోనే ఈ పాఠశాల ఎంపిక కాగా, సుమారు రూ.14లక్షలు కేటాయించారు. ఈ పనులను దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ ఆయా పనులు చేస్తుండగా, ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. అయితే లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలో వాటర్ ట్యాంకు నిర్మించారు. విద్యార్థులు చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు నల్లాలు సైతం ఏర్పాటు చేశారు. అయితే ఈ వాటర్ ట్యాంకులోకి నీళ్లు ఎక్కించాలంటే ప్రత్యేకంగా బోరు, మోటారును ఏర్పాటు చేయాలి. కానీ మన ఊరు–మన బడిలో బోరు, మోటారుకు నిధులు కేటాయించకపోవడం గమనార్హం. దాంతో అన్ని హంగులతో ఈ పథకం కింద చేస్తున్న పనులతో తాగునీటి సౌకర్యాన్ని కల్పించకపోతే ప్రయోజనం ఏంటని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంకు, నల్లాలు నిరుపయోగంగానే మారే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పాఠశాలలో నూతన హంగులతో నిర్మించిన మరుగు దొడ్లకు సైతం నీళ్ల సౌకర్యాన్ని కల్పించకపోవడంతో వీటిని నిర్మించిన ప్రయోజనం లేకుండా పోతున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు బోరు, మోటారు నిర్మించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం లేదు



పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేని మాట వాస్తవమే. మన ఊరు–మన బడి ద్వారా అభివృద్ధి పనులు చేస్తున్నారు. కానీ ఈ పథకంలో బోరు, మోటారును ప్రతిపాదించలేదు. దాంతో వీటిని ఏర్పాటు చేయడం లేదు. అయితే తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం.

– మడివి కృష్ణారావు, హెచ్ఎం, ఆసుపాక

అధికారుల అలసత్వంతోనే జాప్యం



పనులను పరిశీలిస్తున్న ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి

గుండాల: జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతూ, జాప్యం చేస్తున్నారని ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న కస్తూర్బా పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.3.30 కోట్లు ఖర్చుతో చేపట్టిన పనులు నత్తనడకన, నాసిరకంగా చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ అప్‌గ్రేడ్ చేసినప్పటికీ రాబోయే 80 మందికి మౌలిక సదుపాయలు ఎలా సమకూరుస్తారని ప్రశ్నించారు. 280 మంది విద్యార్థులకు సరిపడని డైనింగ్‌హాల్ నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా భవన నిర్మాణం పూర్తికావడం కష్టమేనని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని, పనుల వేగం పెంచాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ సాదియా సుల్తానా, ఆర్ఐ, బీఆర్ఎస్ మండల నాయకులు కిషోర్, ఖయ్యూం, ప్రవీణ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఎస్వోటు జీఎంకు ఘన సన్మానం

మణుగూరురూరల్: పదోన్నతి బదిలీపై కొత్తగూడెం డైరెక్టర్ పీఅండ్‌పీ కార్పొరేట్‌కు ఏజీఎంగా వెళ్తున్న మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్‌ను ఏరియా జీఎం దుర్గం రాంచందర్, అధికారులు, ఉద్యోగులు బుధవారం జీఎం కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం రామచందర్ మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనలో లలిత్‌కుమార్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ (కేపీయూజీ) జి.నాగేశ్వరరావు, ఏజీఎం (సివిల్) వెంకటేశ్వర్లు, రక్షణ అధికారి వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, డీజీఎం(పర్సనల్) రమేష్, డీజీఎం (ఐఈడీ) వెంకట్రావు పాల్గొన్నారు.



ఎస్వోటు జీఎం లలిత్ కుమార్‌ను సన్మానిస్తున్న జీఎం రాంచందర్, అధికారులు

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వివిధ రకాల వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యుడు రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని తిరుమలకుంట కాలనీలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, 32 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. చిరు వ్యాధులతో బాధ పడే వారిని గుర్తించి ఉచితంగా మందులు అందించారు. తిరుమలకుంట కాలనీ, తోగూడెం గ్రామాల్లో స్థానిక సర్పంచ్ సున్నం సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు నారం వెంకటలక్ష్మి చేతుల మీదుగా దోమల నివారణ మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని 187 గృహాలకు దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలు వర్తింపజేయాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ హాస్పటల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ సమస్యలపై శ్రామిక మహిళా పట్టణ కార్యదర్శి మర్లపాటి రేణుక, సీఐటీయూ టౌన్ నాయకులు గుడిపల్లి లక్ష్మీకాంత, పారెల్లి సంతోష్ కుమార్ సర్వే చేశారు.

ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ.. పట్టణ వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ హాస్పిటళ్లలో పనిచేస్తున్న స్టాఫ్‌కి కనీస వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అమలు చేయాలని కోరారు. డబుల్ బెడ్రూం, గృహలక్ష్మి పథకం కింద స్థలాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ నాయకులు అప్పారి రాము, డి.సతీష్, హాస్పిటల్ స్టాఫ్స్, వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలను రద్దు చేయండి



ఆర్ఓఎఫ్ఆర్ డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

చర్ల: దేవరాపల్లి గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువు, గ్రామకంఠం భూములను కొందరు అక్రమంగా సర్వే చేయించుకొని అటవీహక్కుల చట్టం ద్వారా పట్టాలు పొందారని, వెంటనే ఆ అక్రమ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ దేవరాపల్లికి చెందిన గిరిజనులు గురువారం సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుల ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఆర్ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరావు, సర్పంచ్ కారం సమ్మయ్య మాట్లాడుతూ.. గ్రామకంఠంగా ఉంచిన 20 ఎకరాల భూమిని 15 మందికి పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారని, వీటన్నింటినీ రద్దు చేసి పెద్ద చెరువును, గ్రామకంఠం భూమిని కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు తెల్లం లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ తెల్లం సమ్మయ్య, దేవరాపల్లి అటవీహక్కుల చట్టం కమిటీ సభ్యుడు రామారావు, పాయం రామ్మూర్తి, కారం సత్యనారాయణ, కారం రామారవు, కారం కృష్ణమూర్తి, ఆలం నాగేశ్వరావు, వాసం శ్రీదేవి, పాయం నర్సమ్మ, పాయం శారద, నర్సమ్మ, చినసాయమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి తెల్లం రమణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు 102వ జయంతిని గాయత్రి బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ శర్మ, బి.రామాచార్యులు, శ్రీనివాస్ శర్మ, రాంబాబు, కృష్ణశర్మ, శేషాచార్యులు, మోహన్ శర్మ, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

భద్రాచలంటౌన్: భద్రాచలం హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఏఐజీ ఇన్సూరెన్స్ తీసుకున్న ఖాతాదారుడికి ప్రమాద బీమా చెక్కును పోస్ట్ మాస్టర్ రామ్మోహన్‌రావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న కుమార్ రూ.399తో ఏఐజీ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ద్విచక్ర ప్రమాదంలో కుమార్ చేతికి తీవ్ర గాయం కావడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఈ ఘటనకు సంబంధించిన మెడికల్ క్లెయిమ్ సొమ్మును రూ.62.740 వేలు ఇన్సూరెన్స్ కంపెనీ కుమార్ పోస్ట్ ఆఫీస్ ఖాతాలో జమ చేసినట్లు పోస్ట్ మాస్టర్ తెలిపారు. సచిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

దమ్మపేట: మండల కేంద్రంలో నిర్వహించిన జనసేన పార్టీ సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం దమ్మపేట గ్రామంలో యార్లగడ్డ శ్రీనివాసరావు అధ్యక్షతన జనసేన మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షుడిగా జంగా చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా రేళ్ల సతీష్‌ను ఎన్నుకున్నారు.

నిరసన విజయవంతం

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట నల్ల బాడ్జీలతో నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైనదని అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఆర్డీఓ అశోకచక్రవర్తికి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కోటేశ్వరరావు, మేరీ, కోటమ్మ, ప్రసాద్, కృష్ణమూర్తి, మంగయ్య, రాజబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ వితరణ

చర్ల: ఇటీవల పర్ణశాల పంచాయతీ పరిధిలోని పెదబండిరేవు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన సోయం రాజమ్మ కుటుంబాన్ని సర్పంచ్ తెల్లం వరలక్ష్మి పరామర్శించారు. బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, వంట గ్యాస్‌ను అందజేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు తెల్లం హరికృష్ణ, కొమరం గజేందర్, నవీన్, కురసం సమ్మయ్య, జిలకర రమేష్, దనగం వంశీ, పొడియం హర్ష, చాట్ల ప్రవీణ్, సకినం సంతోష్, కొమరం నరేష్, లింగాల ప్రకాశ్, పూనెం శివ పాల్గొన్నారు.

అందరికీ పట్టాలివ్వాలి

మణుగూరురూరల్: పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని టీడీపీ పినపాక నియోజకవర్గ నాయకుడు వట్టం నారాయణదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అరకొర భూములకు మాత్రమే పట్టాలు ఇస్తే చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దొడ్డి కృష్ణ, కమురున్నీసాబేగం, మల్లిడి లోకేష్, యార్లగడ్డ రాజా, భద్రయ్య, రఘురాం పాల్గొన్నారు.

నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే..



భద్రాచలంఅర్బన్: మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్

భద్రాచలంఅర్బన్: భారతీయ సమైక్యత, సమగ్రతకు చిచ్చు పెడుతున్న మతోన్మాదులు దేశద్రోహులని, ఈ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కమ్యూనిస్టులు నిజమైన దేశభక్తులని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. సీపీఎం భద్రాచలం పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను బండారు చందర్‌రావు భవన్‌లో బుధవారం ప్రారంభించారు. ముందుగా పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి ఆవిష్కరించారు. ఆపై ప్రిన్సిపల్‌గా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి వ్యవహరించిన రాజకీయ తరగతుల్లో రవికుమార్ మతం, మతోన్మాదం అనే పాఠ్యాంశాన్ని వివరించారు. భారత స్వతంత్ర ఉద్యమంలో ఏమాత్రం సంబంధంలేని ఆర్ఎస్ఎస్, బీజేపీలు నేడు దేశాన్ని పాలిస్తున్నాయని, మతం పేరుతో ప్రజలను చీల్చుతున్నాయని విమర్శించారు. అనంతరం మార్క్సిస్టు పార్టీ విశిష్టతపై సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య మాట్లాడుతూ.. దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని కార్పొరేట్ శక్తులు నడిపిస్తున్నాయని అన్నారు. అందుకే కార్మికులు, పేదలు ఉద్యోగులు, రైతుల సమస్యలు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగా, పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్‌బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, ఎస్.లీలావతి పట్టణ కమిటీ సభ్యులు డి.లక్ష్మి, యు జ్యోతి, జీవన జ్యోతి, నాగరాజు, లక్ష్మణ్, కుంజ శ్రీను, కోరాడ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ చేగొండి శ్రీనివాస్, లక్ష్మణ్, సీహెచ్.మాధవ్, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ప్రాముఖ్యత

అశ్వారావుపేటరూరల్: ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టు సిద్ధాంతాలకు మరింత ప్రాముఖ్యత పెరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. మండలంలోని వినాయకపురం గ్రామంలో బుధవారం సీపీఎం మండల రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని, అధికారం, పదవుల కోసం ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. సీపీఎం మార్క్సిజం, లెనినిజంపై ఆధారపడి పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో పిట్టల అర్జున్, బి.చిరంజీవి, గడ్డం సత్యనారాయణ, సూరిబాబు, మడిపల్లి వెంకటేశ్వరరావు, సీతారామయ్య, గోవిందరావు, ప్రసాద్, జగన్నాథం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు పోటీలు

దమ్మపేట: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు జూలై 3వ తేదీన మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారిని కీసర లక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం దమ్మపేటలో మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తారని అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన అనంతరం ప్రవేశాలు కల్పించబడునని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ ప్రవేశాలకు అర్హులేనని తెలిపారు. పూర్తి వివరాల కోసం పీఈటీ రామనాథంను ఫోన్ నంబర్ 8328260671 ద్వారా సంప్రదించవచ్చని సూచించారు.

పీఈటీలతో సమావేశం

ములకలపల్లి: హకీంపేటలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు విద్యార్థులకు ఎంపిక నిమిత్తం మండలంలో పాఠశాలల పీఈటీలతో ఎంఈఓ శ్రీరామ్మూర్తి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగు, ఐదో తరగతి విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ములకలపల్లి ఉన్నత పాఠశాలలో జూలై 3వ తేదీన ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్‌తోపాటు, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నైటింగేల్ అవార్డు గర్వకారణం



సుశీల దంపతులకు సన్మానించిన డీఎంహెచ్ఓ, తదితరులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీ ఏఎన్ఎం తేజావత్ సుశీల ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించడం గర్వకారణమని డీఎంహెచ్ఓ శిరీష అన్నారు. ఆరోగ్య కేంద్రంలో గురువారం సుశీల దంపతులను సన్మానించగా ఆమె మాట్లాడారు. కలెక్టర్ అనుదీప్ నేతృత్వాన జరుగుతున్న కృషితో జిల్లాకు జాతీయ స్థాయి అవార్డులు లభిస్తున్నాయని తెలిపారు. కాగా, నైటింగేల్ అవార్డు అందుకున్న సుశీల స్ఫూర్తితో సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎంపీపీ సున్నం లలిత, ఎంపీడీఓ అన్నపూర్ణ, సీడీపీఓ నిర్మలాజ్యోతి, ఎంఈఓ సత్యనారాయణ, వైద్యులు ప్రియాంక, తన్మయి, సర్పంచ్ సున్నా బసవయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మణుగూరురూరల్: బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న ఆదివాసీ నిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన ప్యాకేజీ ఇచ్చి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, ఆదివాసీ నేత చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేలైన్ నిర్వాసితుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీపీఎస్ నిర్వాసితులకు ఇచ్చిన విధంగానే రైల్వేలైన్ నిర్వాసితులకు కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వర్సా శ్రీనివాస్, వజ్జా మహేష్, బండారి పుల్లయ్య, హనుమంతు, శ్రీను, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో హర్షం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కోడిపుంజుల వాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించడంపై టీజీబీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు, ఎంపీటీసీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపూడి కోటేశ్వరరావు, సర్పంచ్ ఏనిక ప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సింగరేణి కార్మికులు, సీటైప్ అధికారులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కోడిపుంజుల వాగు లోలెవల్ రోడ్డు సమస్య స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చొరవతో సింగరేణి ఆధ్వర్యంలో పరిష్కారానికి నోచుకుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి.వెంకట్రావు, బుద్దరాజు నవీన్‌బాబు పాల్గొన్నారు.

ప్రతీ రిపోర్టును ఆన్‌లైన్ చేయాలి

గుండాల: ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు అన్ని రిపోర్టులను ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని మండల విద్యాధికారి పెండెకట్ల క్రిష్ణయ్య అన్నారు. బుధవారం గుండాల, ఆళ్లపల్లి మండలంలోన్ని ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, యుడైస్ ఆన్‌లైన్, మధ్యాహ్న భోజన వివరాలతో పాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం తదితర వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు, మంజు భార్గవి, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం మాట్లాడారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఐఎస్, సీసీలోలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇటుక అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు సర్పంచ్ మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ఇంటింటికీ ఒక ఇటుక అందజేశారు. ఇటుకకు ఇళ్లలో పూజలు చేసి ఏకాదశి అయిన గురువారం కుటుంబసభ్యులతో కలిసి గర్భగుడి నిర్మాణానికి అందజేయాలని సూచించారు.

బీజేపీతోనే ప్రజా సంక్షేమం



మణుగూరురూరల్: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్ని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్, కొత్త కాలనీలలో మహాజన్ సంపర్క్‌లో భాగంగా బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామ్మోహన్‌రావు, సత్యనారాయణ, వెంకన్న, చక్రవర్తి, శ్రీను, సుదర్శన్, వెంకటసుబ్బయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని పగిడేరు గ్రామ పంచాయతీలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు నేతృత్వంలో కొనసాగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంజా రామకృష్ణ, నాయకులు కిషోర్, బిక్షపతి, రామకృష్ణంరాజు, నాగేషు, మురళీమోహన్‌రాజు, రవికుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.